29-03-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - విచార సాగర మంథనము చేసే అలవాటును చేసుకోండి, ఏకాంతములో ఉదయముదయమే విచార సాగర మంథనము చేసినట్లయితే ఎన్నో కొత్త-కొత్త పాయింట్లు బుద్ధిలోకి వస్తాయి"

ప్రశ్న:- పిల్లలు తమ అవస్థను ఫస్ట్ క్లాస్ గా తయారుచేసుకోవాలంటే ఏ-ఏ విషయాలపై సదా ధ్యాసను ఉంచాలి?

జవాబు:- 1) ఒక్క తండ్రి ఏదైతే వినిపిస్తారో అదే వినండి, మిగిలిన ఈ ప్రపంచానికి సంబంధించిన విషయాలేవీ వినకండి. 2) సాంగత్యాన్ని సంభాళించుకోండి. ఎవరైతే మంచి రీతిలో చదువుతారో, ధారణ చేస్తారో వారి సాంగత్యమునే చేయండి, తద్వారా అవస్థ ఫస్ట్ క్లాస్ గా అవుతుంది. కొంతమంది పిల్లల అవస్థను చూసి బాబాకు - ఈ డ్రామాలో ఏదైనా మార్పు జరిగితే బావుండును అన్న ఆలోచన కలుగుతుంది, కానీ మళ్ళీ - రాజధాని స్థాపన అవుతోంది కదా అని అంటారు.

ఓం శాంతి. ఒక్క అనంతమైన తండ్రే అనంతమైన పిల్లలకు కూర్చొని అర్థం చేయిస్తారు మరియు చదివిస్తారు. ఇకపోతే మనుష్యులు ఏదైతే చదువుతారో మరియు వింటారో, అవేవీ మీరు వినకూడదు, చదవకూడదు, ఎందుకంటే - ఇది ఒక్కటే ఈశ్వరీయ చదువని, దీనిని ఇప్పుడు మీరు చదవాలని మీకు అర్థమయ్యింది. మీరు కేవలం ఒక్క ఈశ్వరుని ద్వారానే చదువుకోవాలి. తండ్రి ఏదైతే నోటి ద్వారా చదివిస్తారో, నేర్పిస్తారో, దానినే మీరు చదువుకోవాలి. వాళ్ళు అయితే అనేక రకాల పుస్తకాలను వ్రాస్తారు, వాటిని మొత్తం ప్రపంచమంతా చదువుతుంది. ఎన్ని లెక్కలేనన్ని పుస్తకాలను చదువుతూ ఉండవచ్చు. ఒక్కరి నుండే వినండి, మళ్ళీ దానినే ఇతరులకు వినిపించండి అని కేవలం పిల్లలైన మీరే అంటారు, ఎందుకంటే వారి నుండి ఏదైతే వింటారో అందులోనే కళ్యాణము ఉంది. ఇకపోతే పుస్తకాలైతే లెక్కలేనన్ని ఉన్నాయి, కొత్తకొత్తవి కూడా వెలువడుతూ ఉంటాయి. ధర్మబద్ధమైన విషయాలనైతే ఒక్క తండ్రే వినిపిస్తారని మీకు తెలుసు. అంతే, కేవలం వారి నుండే వినాలి. తండ్రి అయితే పిల్లలకు చాలా కొద్దిగానే అర్థం చేయిస్తారు, దానినే విస్తారములో అర్థం చేయించి మళ్ళీ ఒకే విషయములోకి వస్తారు. బాబా 'మన్మనాభవ' అన్న పదము సరైనదే అని అంటారు కానీ, బాబా ఆ పదాన్ని చెప్పలేదు. బాబా ఏమని చెప్తారంటే - స్వయాన్ని ఆత్మగా భావించండి, తండ్రినైన నన్ను స్మృతి చేయండి మరియు సృష్టి చక్రపు ఆదిమధ్యాంత జ్ఞానాన్ని ఏదైతే వినిపిస్తానో దానిని ధారణ చేయండి. మనమెవరమైతే దేవతలుగా అవుతామో, మనమే మళ్ళీ వృద్ధి చెందుతాము అని కూడా మీకు తెలుసు. పిల్లలకు మూలవతనము కూడా గుర్తుంది, అలాగే కొత్త ప్రపంచము కూడా గుర్తుంది.

మొట్టమొదట ఉన్నతోన్నతమైనవారు తండ్రి, ఆ తర్వాత ఈ కొత్త ప్రపంచము, ఇందులో ఈ లక్ష్మీ-నారాయణులు ఉన్నతోన్నతమైన రాజ్యాన్ని పాలించేవారు. చిత్రాలైతే తప్పకుండా కావాలి. కేవలం వాటి గుర్తులు మిగిలిపోయాయి. ఈ ఒక్క చిత్రమే ఉంది. రామునిది కూడా ఉంది కానీ రామరాజ్యాన్ని స్వర్గము అని అనరు. అది సెమీ స్వర్గము. ఇప్పుడు ఉన్నతోన్నతుడైన తండ్రి చదివిస్తున్నారు. ఇందులో పుస్తకాలు మొదలైనవాటి అవసరమేమీ లేదు. మరుసటి జన్మలో చదువుకునేందుకు ఈ పుస్తకాలు మొదలైనవేవీ మిగిలి ఉండవు. ఈ చదువు కేవలం ఈ జన్మ కొరకే. ఇది అమరకథ కూడా. కొత్త ప్రపంచం కొరకు నరుని నుండి నారాయణునిగా అయ్యే శిక్షణను కూడా తండ్రే ఇస్తారు. పిల్లలు 84 జన్మల చక్రాన్ని కూడా తెలుసుకున్నారు. ఇది చదువుకునే సమయము. బుద్ధిలో మంథనం నడుస్తూ ఉండాలి. మీరు ఇతరులను కూడా చదివించాలి. ఉదయమే లేచి విచార సాగర మంథనము చేయాలి. ఉదయంవేళలోనే విచార సాగర మంథనము బాగా జరుగుతుంది. అర్థం చేయించేవారు ఎవరైతే ఉంటారో వారికే మంథనము జరుగుతుంది. టాపిక్ లు, పాయింట్లు మొదలైనవి వెలువడతాయి. భక్తి విషయాలను జన్మజన్మాంతరాలూ విన్నారు. ఈ జ్ఞానాన్ని జన్మజన్మాంతరాలూ వినరు. దీనిని తండ్రి ఒకేసారి వినిపిస్తారు, ఆ తర్వాత ఈ జ్ఞానాన్ని మీరు కూడా మర్చిపోతారు. భక్తి మార్గపు పుస్తకాలు ఎన్ని ఉన్నాయి. విదేశాల నుండి కూడా వస్తాయి. అవన్నీ అంతమవ్వనున్నాయి. సత్యయుగములో ఎటువంటి పుస్తకాలు మొదలైనవాటి అవసరం లేదు. అవన్నీ కలియుగ సామాగ్రియే. హాస్పిటళ్ళు, జైళ్ళు, జడ్జులు మొదలైనవేవైతే ఇక్కడ చూస్తారో అవేవీ అక్కడ ఉండవు. ఆ ప్రపంచమే వేరుగా ఉంటుంది. ప్రపంచమైతే ఇదే కానీ కొత్తదానికి మరియు పాతదానికి తేడా అయితే తప్పకుండా ఉంటుంది కదా. దానిని స్వర్గము అని అంటారు. అదే ప్రపంచము మళ్ళీ నరకముగా అవుతుంది. ఫలానావారు స్వర్గస్థులయ్యారు అని నోటితో అంటారు. బ్రహ్మములో లీనమయ్యారని, నిర్వాణములోకి వెళ్ళారని సన్యాసుల గురించి కూడా అంటూ ఉంటారు కానీ అలా నిర్వాణములోకి ఎవరూ వెళ్ళరు. ఈ రుద్రమాల ఎలా తయారయ్యింది అనేది మీకు తెలుసు. రుండ మాల కూడా ఉంది. విష్ణు రాజధాని

యొక్క మాల తయారవుతుంది. ఇప్పుడు మాల రహస్యాన్ని అయితే పిల్లలైన మీరే తెలుసుకున్నారు. నంబరువారు చదువు అనుసారంగానే మాలలో స్మరింపబడతారు. మొట్టమొదట ఈ నిశ్చయము కావాలి. ఇది ఈశ్వరీయ చదువు. వీరు సుప్రీమ్ తండ్రి మరియు సుప్రీమ్ శిక్షకుడు కూడా. మీ బుద్ధిలో ఏ జ్ఞానమైతే ఉందో దానినే ఇతరులకు ఇవ్వాలి. మీ సమానముగా తయారుచేయాలి. విచార సాగర మంథనము చేయాలి. వార్తాపత్రికలు కూడా ఉదయమే వెలువడతాయి. అది సామాన్యమైన విషయమే. ఇక్కడైతే ఒక్కొక్క విషయమూ లక్షల రూపాయల విలువైనది. కొందరు బాగా అర్థం చేసుకుంటారు, కొందరు తక్కువగా అర్థం చేసుకుంటారు. చదవడం మరియు చదివించడం ఆధారముపైనే మళ్ళీ కొత్త ప్రపంచములో పదవి లభిస్తుంది. విచార సాగర మంథనము చేయడానికి ఎంతో ఏకాంతము కావాలి. రామతీర్థుడి గురించి ఏం చెప్తూ ఉంటారంటే - అతను ఏదైనా వ్రాసేటప్పుడు అతని శిష్యుడిని ఒక మైలు దూరం వెళ్ళమనేవారు, లేకపోతే వైబ్రేషన్లు వస్తాయి అని అనేవారు.

మీరు ఇప్పుడు పర్ఫెక్ట్ గా అవుతున్నారు. మొత్తం ప్రపంచమంతటిదీ డిఫెక్ట్ ఉన్న బుద్ధి (లోపాలు ఉన్న బుద్ధి). మీరు ఈ చదువు ద్వారా ఈ లక్ష్మీ-నారాయణులుగా అవుతారు. ఇది ఎంత ఉన్నతమైన చదువు! కానీ ఇక్కడ నంబరువారుగా కూర్చోబెట్టలేము. అలా కూర్చోబెడితే వెనుక కూర్చోవడంతో నిరాశపడతారు, తికమకపడతారు, వాయుమండలాన్ని పాడు చేస్తారు. ఆ మాటకొస్తే నియమం అయితే నంబరువారుగానే కూర్చోబెట్టాలి అని ఉంది. కానీ ఈ విషయాలన్నింటి గురించి బెల్లంకు మరియు బెల్లం సంచికే తెలుసు. ఇది చాలా ఉన్నతమైన జ్ఞానము. మీ క్లాస్లు వేర్వేరుగా అయితే చేయలేము. వాస్తవానికి మీరు క్లాసులో ఒకరి అవయవాలు ఒకరికి తగులకుండా కూర్చోవాలి. మైక్ ద్వారానైతే దూరం నుండి కూడా మాటను వినగలుగుతారు. తండ్రి అంటారు - ఈ ప్రపంచానికి సంబంధించిన ఏ విషయాలను మీరు వినకండి, చదవకండి. వారితో సాంగత్యాన్ని కూడా చేయకండి. ఎవరైతే బాగా చదువుతారో, వారి సాంగత్యమునే చేయాలి. ఎక్కడైతే మంచి సేవ ఉంటుందో, ఉదాహరణకు ఎక్కడైతే మ్యూజియంలు మొదలైనవి ఉంటాయో, అక్కడ చాలా చురుకైన మరియు యోగయుక్తులైన కుమార్తెలు కావాలి.

డ్రామా రచింపబడి ఉంది అని కూడా తండ్రి అర్థం చేయిస్తారు. అప్పుడప్పుడు బాబా - ఈ డ్రామాలో ఏదైనా మార్పు జరిగితే బావుండును అని ఆలోచిస్తారు, కానీ అలా మార్పు జరుగదు. ఇది తయారై-తయారుచేయబడిన ఆట. పిల్లల అవస్థను చూసినప్పుడు ఏదైనా మార్పు జరిగితే బావుండును అని అనిపిస్తుంది. ఇటువంటివారు స్వర్గములోకి వెళ్ళగలరా? అని అనిపిస్తుంది. మళ్ళీ ఆలోచన వస్తుంది - స్వర్గములోనైతే మొత్తం రాజధాని అంతా కావాలి కదా. దాస-దాసీలు, చండాలులు మొదలైనవారు కూడా కొందరు ఉంటారు. డ్రామాలో ఏ మార్పు జరుగదు. భగవానువాచ - ఈ డ్రామా రచింపబడి ఉంది, దీనిని నేను కూడా మార్చలేను. భగవంతుని కన్నా పైన అయితే ఎవరూ లేరు. మనుష్యులైతే భగవంతుడు చేయలేనిదంటూ ఏముంటుంది? అని అంటారు, కానీ భగవంతుడు స్వయంగా అంటున్నారు - నేను ఏమీ చేయలేను, ఇది తయారై-తయారుచేయబడిన ఆట. విఘ్నాలు వస్తాయి, ఏమీ చేయలేము. అవి డ్రామాలో నిశ్చితమై ఉన్నాయి, నేను ఏమి చేయగలను? చాలామంది పిల్లలు - మమ్మల్ని వివస్త్రగా అవ్వడం నుండి రక్షించండి అని పిలుస్తారు, కానీ తండ్రి ఏమి చేస్తారు? తండ్రి కేవలం - డ్రామాలో రచింపబడి ఉంది అని అంటారు. ఇది తయారై-తయారుచేయబడిన డ్రామా. ఇది భగవంతుని రాత అని భావించకండి. భగవంతుని చేతిలో ఉన్నట్లయితే, అనన్యులెవరైనా శరీరాన్ని వదిలివేస్తే వారిని కూడా రక్షించేస్తారు కదా. ఇలా ఎంతోమందికి సంశయం వస్తుంది. భగవంతుడు చదివిస్తున్నారు కదా, మరి భగవంతుని పిల్లలైనట్లయితే భగవంతుడు తమ పిల్లలను రక్షించలేరా! అని అంటారు. ఎన్నో ఫిర్యాదులు చేస్తారు. మరి సాధువులైతే కొందరి ప్రాణాలను రక్షిస్తారు, ప్రాణం మళ్ళీ వస్తుంది, చితి నుండి కూడా లేచి వస్తారు అని అంటారు. అప్పుడు, ఈశ్వరుడు తిరిగి పంపించారు, మృత్యువు తీసుకువెళ్ళింది కానీ వారిపై ప్రభువు దయ చూపించారు అని అంటారు. తండ్రి అర్థం చేయిస్తున్నారు - డ్రామాలో ఏదైతే రచింపబడి ఉందో, అదే జరుగుతుంది. తండ్రి కూడా ఏమీ చేయలేరు. దీనిని డ్రామా విధి అని అంటారు. డ్రామా అన్న పదము గురించి మీకు తెలుసు. వారు అంటారు - ఏదైతే జరగవలసి ఉందో అదే జరిగింది, చింత దేనికి? మిమ్మల్ని నిశ్చింతులుగా చేస్తారు. క్షణక్షణమూ ఏదైతే జరుగుతుందో దానిని డ్రామాగానే భావించండి. ఆత్మ శరీరాన్ని వదిలి వెళ్ళి ఇంకొక పాత్రను అభినయిస్తుంది. అనాది పాత్రను మీరు ఎలా మార్చగలరు! ప్రస్తుతం అవస్థ కాస్త అపరిపక్వంగా ఉన్నా సరే ఎంతో కొంత ఆలోచన కలుగుతుంది. కానీ విధి అలా ఉంది, ఏమీ చేయలేము. మనుష్యులు ఏమైనా అన్నా కానీ, మన బుద్ధిలో అయితే డ్రామా రహస్యము ఉంది. పాత్రను అభినయించాలి. చింతించే విషయమేమీ లేదు. ఎంతవరకైతే అవస్థ అపరిపక్వంగా ఉంటుందో, అంతవరకూ ఏదో ఒక అల వస్తూ ఉంటుంది.

ఈ సమయంలో మీరందరూ చదువుతూనే ఉన్నారు. మీరందరూ దేహధారులు, నేనొక్కడినే విదేహిని. దేహధారులందరికీ నేర్పిస్తాను. తండ్రి అర్థం చేయిస్తున్నారు - అప్పుడప్పుడూ పిల్లలైన మీకు ఈ బ్రహ్మ కూడా కూర్చుని చదివిస్తారు. ఈ తండ్రి పాత్ర మరియు ప్రజాపిత బ్రహ్మ పాత్ర అద్భుతమైనది. ఈ తండ్రి విచార సాగర మంథనం చేసి మీకు వినిపిస్తూ ఉంటారు. ఇది ఎంత అద్భుతమైన జ్ఞానము! బుద్ధిని ఎంతగా నడిపించాల్సి ఉంటుంది. బాబా యొక్క విచార సాగర మంథనం ఉదయంవేళ నడుస్తుంది. మీరు కూడా ఈ టీచర్ వలె తయారవ్వాలి. కానీ తేడా అయితే తప్పకుండా ఉంటుంది. టీచర్ విద్యార్థికెప్పుడూ 100 మార్కులు ఇవ్వరు, కొంత తక్కువ ఇస్తారు. వారు ఉన్నతోన్నతమైనవారు, మనము దేహధారులము, మరి బాబా వలె 100 శాతమూ ఎలా తయారవ్వగలము? ఇవి చాలా గుహ్యమైన విషయాలు, కొందరు వీటిని విని ధారణ చేస్తారు, సంతోషం కలుగుతుంది. కానీ మరికొందరు - బాబా వాణి అయితే ఒకే విధంగా నడుస్తుంది కదా, అది రిపీట్ అవుతుంది కదా అని అంటారు. ఇప్పుడు కొత్త-కొత్త పిల్లలు ఎవరైనా వస్తే, నేను మళ్ళీ మొదటి పాయింటును చెప్పవలసి ఉంటుంది. కొన్నిసార్లు ఇతరులకు అర్థం చేయించేందుకు ఏదైనా కొత్త పాయింటు కూడా వస్తుంది. ఎంతైనా పిల్లలు తండ్రికి సహాయం చేయవలసి ఉంటుంది. మ్యాగజీన్ ను తయారుచేస్తారు. కల్పపూర్వము కూడా అలానే వ్రాసి ఉంటారు. ఒకవేళ ఏదైనా వార్తాపత్రికను తయారుచేసినట్లయితే దాని పట్ల ఎంతో అటెన్షన్ ను ఉంచవలసి ఉంటుంది. మనుష్యులు అది చదివి అసంతుష్టులయ్యే విధమైన విషయమేదీ అందులో ఉండకూడదు. మ్యాగజీన్ ను అయితే మీరే చదువుతారు. ఏదైనా అలాంటి-ఇలాంటి విషయం ఉంటే - ప్రస్తుతం ఇంకా సంపూర్ణులుగా అవ్వలేదు అని అంటారు. ఖచ్చితంగా 16 కళల సంపూర్ణులుగా అవ్వడానికి సమయమైతే పడుతుంది కదా. ఇప్పుడు ఇంకా చాలా సేవ చేయాలి. ఎంతోమంది ప్రజలను తయారుచేసుకోవాలి. అనేక రకాలైన మార్కులు ఉన్నాయని కూడా బాబా అర్థం చేయించారు. ఎవరైనా నిమిత్తులుగా అయి, అనేకులు జ్ఞానం తీసుకునేందుకు తగిన ఏర్పాట్లను చేస్తే, వారికి కూడా ఫలము లభిస్తుంది. ఇప్పుడైతే ఇక పాత ప్రపంచమే అంతమైపోనున్నది. ఇక్కడ ఇది అల్పకాలికమైన సుఖము. రోగాలు మొదలైనవైతే అందరికీ వస్తాయి. బాబా అన్ని విషయాలలోనూ అనుభవజ్ఞులు. ప్రాపంచిక విషయాలను కూడా అర్థం చేయిస్తారు. బాబా అన్నారు - వార్తాపత్రికలలో లేక మ్యాగజీన్లలో అద్భుతమైన విషయాలను వ్రాయండి, వాటిని చూసి బ్రహ్మకుమారీలు ఈ విషయాన్ని చాలా కరక్టుగా వ్రాసారు అని మనుష్యులు భావించాలి. ఈ యుద్ధము 5,000 సంవత్సరాల క్రితం ఇదే విధంగా జరిగింది. అది ఎలా? అన్నది వచ్చి అర్థం చేసుకోండి. మీ పేరు కూడా ప్రఖ్యాతమవుతుంది, మనుష్యులు విని సంతోషిస్తారు కూడా, ఇది చాలా పెద్ద విషయము! కానీ ఇది ఎవరి బుద్ధిలోనైనా కూర్చోవాలి కదా. ఎవరైతే వ్రాస్తారో వారు అర్థం చేయించాలి కూడా. అర్థం చేయించడం రాదేమో, అందుకే వారు వ్రాయడం లేదు కూడా. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఒక్క తండ్రి ఏదైతే వినిపిస్తారో లేక చదివిస్తారో, అదే వినండి మరియు చదవండి. మిగిలినవేవీ చదవవలసిన-వినవలసిన అవసరం లేదు. సాంగత్యాన్ని చాలా-చాలా సంభాళించుకోండి. ఉదయముదయమే ఏకాంతంలో కూర్చొని విచార సాగర మంథనం చేయండి.

2. డ్రామా విధి నిశ్చితముగా తయారుచేయబడి ఉంది, అందుకే సదా నిశ్చింతులుగా ఉండండి. ఏ విషయంలోనూ సంశయం రానివ్వకండి. ఎవరు ఏమి అన్నా కానీ మీరు డ్రామాపై స్థిరంగా ఉండండి.

వరదానము:- అథారిటీలుగా అయ్యి సమయానికి సర్వశక్తులను కార్యములో వినియోగించే మాస్టర్ సర్వశక్తివాన్ భవ

సర్వశక్తివంతుడైన తండ్రి ద్వారా ఏవైతే సర్వశక్తులు ప్రాప్తించాయో, వాటిని ఎటువంటి పరిస్థితిలో, ఎటువంటి సమయములో మరియు ఏ విధితో మీరు కార్యములో వినియోగించాలనుకుంటారో, అదే రూపములో ఈ శక్తులు మీకు సహయోగులుగా అవ్వగలవు. ఈ శక్తులను మరియు ప్రభు-వరదానాలను ఏ రూపములో కావాలనుకుంటే ఆ రూపములో ధారణ చెయ్యగలరు. ఇప్పుడిప్పుడే శీతలతా రూపంలో, ఇప్పుడిప్పుడే జ్వలింపజేసే రూపములో ధారణ చెయ్యగలరు. కేవలం సమయానికి కార్యములో వినియోగించే అథారిటీలుగా అవ్వండి. ఈ సర్వశక్తులనేవి మాస్టర్ సర్వశక్తివంతులైన మీకు సేవాధారులు.

స్లోగన్:- స్వపురుషార్థము మరియు విశ్వకళ్యాణ కార్యములో, ఎక్కడైతే ధైర్యము ఉంటుందో అక్కడ సఫలత తప్పకుండా ఉంటుంది.